## మన(సు)లో మాట

ఈ సమయములో అమెరికా సంయుక్త రాష్ట్రములలో పిల్లలు వేసవి సెలవులను గడుపుతున్నారు. మిగతా దేశములలో పాఠశాలలు తెరవబడి ఉండొచ్చు ఈ సమయానికి. వేసవి సెలవులను గురించి ఆలోచిస్తే, ఎన్నెన్నో జ్ఞాపకాలు మనని ఆనందములో ముంచెత్తుతాయి. సుమారు 20 సంవత్సరములకు పూర్వము, వేసవి సెలవులు మొదలయ్యాయంటే, ఆటలు ఆడడం (కంప్యూటర్ ఆటలు, విడియో ఆటలు, గదిలో ఆడే ఆటలు కాదు. కోతికొమ్మంచి, ఏడు పెంకుల ఆట, కబడ్డీ, చాకలి గుడ్డాట, కోకో లాంటి ఆటలు), బంధువులను మరియు మిత్రులను సందర్శించడం, పల్లెలను, అందులో పంట చేలను దర్శించడం, పూజకు అవసరమైన పువ్వులు, పళ్ళు సేకరించడం, అప్పుడప్పుడు సినిమాలకు వెళ్ళడం లాంటివి ఎంతో ఆనందాన్నిచ్చేవి. నేడు పని వత్తిడివల్ల అయితేనేమి, జీవన విధానములో వస్తున్న మార్పువలన అయితేనేమి - పిల్లలకు వేసవి సెలవులకు, పాఠశాలలో తరగతులు సాగుతున్న సమయానికి పెద్దగా తేడాలేదు. పాఠశాలలో తరగతులు సాగుతున్నప్పుడు ఎటూ పాఠశాలకు వెళ్తారు, వేసవి సెలవులలో వేసవి విడిది పాఠశాలలకు (సమ్మర్ స్కూల్) వెళుతున్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించినప్పుడు, ఈ రోజులలో పిల్లలు ఏమి కోల్పోతున్నారో మనకు అవగతమౌతుంది. వారు ప్రపంచాన్ని, దానిలోని అందాల్ని చూడలేక పోతున్నారు, పరిమితమైన విషయజ్ఞానాన్ని మాత్రమే పొందగలుగుతున్నారు. కొద్ది నిమిషములు ఆలోచించి మన పిల్లలకు ఏది సముచితమో మనమే నిర్ణయించుకుందాం!

ఉద్యోగానికి సంబంధించిన కొన్ని కారణములవలన ఈ ఏడాది శ్రీనివాసరామానుజన్ మేథమేటిక్స్ క్లబ్ (వేసవి కార్యక్రమము) నిర్వహించబడలేదు. గత ఏడు సంవత్సరములుగా కొనసాగిస్తున్న ఈ ప్రక్రియకు ఈ సంవత్సరము ఆటంకము కలిగినది. అయినాపురపు శ్రీనివాసరావు గారు ఉద్యోగరీత్యా పిట్స్‌బర్గ్‌లో ఉంటున్న కారణముగా వేదగణితమునకు సంబంధించిన సదస్సులను పిట్స్‌బర్గ్ మరియు చుట్టుప్రక్కల ప్రదేశములలో నిర్వహించే ప్రయత్నము చేస్తున్నాము. ఈ అవకాశమును వినియోగించుకుని వేదగణితపద్ధతులకు సంబంధించిన అవగాహనను ఏ కొద్ది మందికైనా కలిగించగలిగితే, అది వేదగణిత నిధిని మనకి అందించినవారి ఆశీర్వాదములు లభించినట్లు భావిస్తాము. గతములో వేదగణితమునకు సంబంధించిన ఆన్‌లైన్ తరగతులు నిర్వహించిన ఈ-గురుకుల్ సంస్థ, ఈమధ్య సంస్కృతము నేర్వగోరేవారికొఱకు కాశీ రేష్మిగారి పర్యవేక్షణలో సంస్కృతము తరగతులు నిర్వహించినది. మీరు ఇల్లు కదలకుండా ఇలాంటి విషయములు నేర్చుకోదలిస్తే http://www.e-gurukul.net లో నమోదు చేసుకొని, ఇలాంటి కార్యక్రమాలను గురించిన సమాచారమును పొందండి.

పాఠకులందరికి మరొకసారి వారి రచనలను పంపడానికి ఆహ్వానిస్తున్నాము. మీకు తెలిసిన విషయములను మిగిలిన పాఠక సోదరులతో పంచుకోడానికి ఇది చక్కని వేదిక. మీరు మీ ఆలోచనలను పాఠకులతో పంచుకోవాలని అనుకుంటే ainapura@yahoo.com కి ఈ-మెయిలు పంపండి.

మళ్ళీ అక్టోబరు సంచికలో కలుద్దాం! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.